సాక్షి హనుమకొండ

బుధవారం । 22 । నవంబర్ । 2023



మావోల యాక్షన్ టీం సంచారం

ఏజెన్సీలోకి మావోయిస్టుల యాక్షన్ టీం వచ్చిందని, ఆ సభ్యులను పట్టించాలని ఏటూరునాగారం ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పిలుపునిచ్చారు. -12లో



కాటన్‌మిల్లులో ఐటీ దాడులు

చిల్పూరు మండలం రాజవరం గ్రామ సమీపంలోని సిరి కాటన్ మిల్లులో మంగళవారం ఐటీ అధికారులు దాడులు నిర్వహించారు. -12లో

గరిష్టం/కనిష్టం $30^0/22^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండగా ఉంటుంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది. రాత్రి వేళ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

వలస జీవులకు వల

కాజీపేట: ఉపాధి కోసం వివిధ ప్రాంతాల్లో ఉంటున్న కాజీపేట ఓటర్లకు ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు వలలు విసురుతున్నారు. వారిని నగరానికి రప్పించేందుకు రాయబేరాలకు దిగుతున్నారు. విద్యా, ఉద్యోగాలతో పాటు బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన కాజీపేటకు చెందిన కుటుంబాల్లో దాదాపు 2 వేలకు పైగా మంది ఉంటారు. వారితో ఎలాగైనా ఓటు వేయించాలని అన్ని పార్టీల నాయకులు.. వరుసగా ఫోన్లు చేస్తున్నారు. రానూపోను చార్జీలు, ఇతర ఖర్చులు భరిస్తామంటూ భరోసా కల్పిస్తున్నారు. ఉచితంగా సొంతూరికి వెళ్లినట్లు ఉంటుంది.. ఓటేసి బంధువులను చూసొచ్చినట్లూ ఉంటుందంటూ వలస ఓటర్లు స్వస్థలానికి వచ్చేందుకు ఒప్పుకుంటున్నట్లు నాయకులు చెబుతున్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

విద్యారణ్యపురి: రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు 'ఈకుబేర్'లో పెండింగ్‌లో ఉన్న బిల్లుల్ని చెల్లించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.పర్వతరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండలోని ఎస్టీయూ భవనంలో నిర్వహించిన వరంగల్ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎలక్షన్ కమిషన్ అనుమతితో ఉద్యోగ, ఉపాధ్యాయులకు డీఏలు ప్రకటించాలన్నారు. ఎన్నికల అనంతరం పీఆర్సీ ఫిట్‌మెంట్ సాధనకు, ఐఆర్ పెంపు కోసం కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

ఎస్టీయూ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



మధులిమాయే



నాగరాజు

ఎస్టీయూ జిల్లా నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మధులిమాయే, జనరల్ సెక్రటరీగా దానం నాగరాజు, ఆర్థిక కార్యదర్శిగా తిరుపతి, రాష్ట్ర కౌన్సిలర్‌గా సదయ్య ఎన్నికయ్యారు. అసోసియేట్ అధ్యక్షులుగా రమేశ్, కిషన్, ఎం.నిరంజన్, పి.మనోహర్ ఎన్నికయ్యారు. ఈసమావేశంలో ఎస్టీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కామగోని రాంబాబు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. బాధ్యులు సదయ్య, నరేందర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రవి, సుధాకర్‌రెడ్డి, ఎస్.సాంబయ్య, ఎస్.రమేశ్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంబాబు, వివిధ జిల్లాల ఎస్టీయూ బాధ్యులు పాల్గొన్నారు.

త్వరితగతిన సీఎంఆర్ రవాణా పూర్తి చేయాలి



వరంగల్: వర్షాకాలం, యాసంగి 2022–23 సీఎంఆర్ రవాణాను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్‌కుమార్ అన్నారు. మంగళవారం సీఎంఆర్ రవాణాపై అధికారులతో వరంగల్ కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధి కమలాపురం, ఇల్లంద ధ్యానం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వానాకాలం 2023–24 ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు. సెంటర్ ఇన్‌చార్జ్‌లు ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీలను ఓపీఎంఎస్‌లో చేయాలన్నారు. ఏనుమాములలోని గోదాంలను, ఎంఎల్‌ఎస్ పాయింట్లను తనిఖీ చేశారు. ఆయన వెంట వరంగల్, హనుమకొండ జిల్లా పౌర సరఫరాల అధికారులు, జిల్లా మేనేజర్లు పాల్గొన్నారు.

ఓటర్లకు ఇబ్బందులు తలెత్తొద్దు

ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా



పరకాల: ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం నుంచి హోం ఓటింగ్ విధానం ప్రారంభం కావడంతో ఆమె పరకాల రిటర్నింగ్ కార్యాలయాన్ని పరిశీలించారు. పోస్టల్ బ్యాలెట్ల ఏర్పాట్లను తెలుసుకున్నారు. కార్యక్రమంలో పరకాల ఆర్డీఓ శ్రీనివాస్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమ రాజ్యం



మరిపెడలో జరిగిన డోర్నకల్ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం



సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్, పక్కన అభ్యర్థి రెడ్యానాయక్

రెడ్యానాయక్ సీనియర్ నాయకుడు, నాకు మంచి సలహాదారు

- మళ్లీ గెలిపిస్తే మంచి హోదా కల్పిస్తా..
- గిరిజనుల కోరిక మేరకు తండాలను గ్రామ పంచాయతీలుగా చేశాం
- కాల్వలను చూసి కన్నీరు పెట్టుకున్న చోటే.. ధాన్యపురాశులు పండుతున్నాయి
- ఉద్యమ సమయంలో వీరన్నకు మొక్కి ముందుకెళ్లా..
- రాష్ట్రం సాధించాక స్వామికి కోరమీసం మొక్కు చెల్లించా
- డోర్నకల్ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

సాక్షి, మహబూబాబాద్/ మరిపెడ/ మరిపెడ రూరల్: 'యాడియే.. బాయియే.. బహెనో.. రాం..రాం' అందరూ బాగుండాలి. మంచి పాలన అందాలంటే తెలంగాణను పోరాడి సాధించుకున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం రావాలి. బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమ రాజ్యం సాధ్యం' అని బీఆర్‌ఎస్ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడలో జరిగిన డోర్నకల్ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం ప్రసంగించారు. ఏళ్లుగా గిరిజనులు తమ తండాలో తమ రాజ్యం కావాలని ఆకాంక్షించారని, గత పాలకులు పట్టించుకోలేదని, బీఆర్‌ఎస్ పాలనలో 3500 తండాలను పంచాయతీలుగా ప్రకటించామన్నారు. డోర్నకల్ నియోజకర్గంలోని 82 తండాల్లో గిరిజనులే పాలన సాగిస్తున్నారన్నారు. తన గురించి, పైరవీల గురించి ఆలోచించకుండా ప్రజల కోసమే పని చేసే రెడ్యానాయక్ వంటి నాయకుడు పాలించడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. సీనియర్ నాయకుడిగా ఈ ప్రాంతానికి ఎంతో సేవ చేశారని కొనియాడారు. నాకు మంచి సలహాదారుడిగా ఉంటున్న రెడ్యానాయక్‌ను మళ్లీ గెలిపించాలని, నూతన ప్రభుత్వంలో మంచి హోదా కల్పించే బాధ్యత నాదని కేసీఆర్ ప్రకటించారు.

కురవి వీరభద్రుడు పవర్‌ఫుల్..

నియోజకవర్గంలోని కురవి వీరభద్రుడు పవర్‌ఫుల్ దేవుడు అని కేసీఆర్ అన్నారు. ఉద్యమ సమయంలో వీరన్నకు మొక్కి ముందుకెళ్లానని, తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత బంగారు కోరమీసం చెల్లించి మొక్కులు తీర్చుకున్నానని గుర్తుచేశారు. దేవుడే కాదు.. ఈ ప్రాంత ప్రజలు కూడా మంచి చైతన్యవంతులు అన్నారు. ఇదే చైతన్యంతో మంచి నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు.

కాల్వలతో ధాన్యం రాశులు

గత పాలకులు కాల్వలు తవ్వారు. కానీ ఏనాడూ చుక్కనీరు పారించలేదని కేసీఆర్ అన్నారు. వెన్నవరం కాల్వకు రెడ్యానాయక్, శంకర్‌నాయక్ పట్టుపట్టి సాగునీరు వచ్చేలా కృషి చేశారని పేర్కొన్నారు. దీంతో నాడు నీళ్లు లేక కాల్వలను చూస్తే కన్నీరు వచ్చేదని, ఇప్పుడు నిండా పారుతున్న కాల్వలతో ధాన్యపురాశులు పండుతున్నాయని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం నిర్మించిన ప్రాజెక్టులతో రాష్ట్రంలో 3కోట్ల టన్నుల ధాన్యం పండుతుందని, సీతారామ, పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేసుకుంటే ధాన్యం ఉత్పత్తి 4కోట్ల టన్నులకు చేరుతుందని వివరించారు. సభలో మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ కవిత, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నవీన్‌రావు, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, సీనియర్ నాయకులు నూకల నరేశ్‌రెడ్డి, రామసహాయం రంగారెడ్డి, నూకల శ్రీరంగారెడ్డి, డీఎస్ రవిచంద్ర, మున్సిపల్ చైర్‌పర్సన్ సింధూర, ఎంపీపీ అరుణ, జెడ్పీటీసీ శారద, వేణుగోపాల్‌రెడ్డి, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, ముత్యం వెంకన్న, అయూబ్ పాషా, చాపల యాదగిరిరెడ్డి, మహేందర్‌రెడ్డి, కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ సభ సైడ్‌లైట్స్

- **మధ్యాహ్నం 3:30 గంటలకు:** సభ ప్రాంగణానికి చేరుకున్న సీఎం హెలికాప్టర్.. వేదిక చుట్టూ ఒక రౌండ్ చక్కర్లు.
- **3:37 గంటలకు :** హెలికాప్టర్ ల్యాండింగ్
- **3:43 గంటలకు :** హెలిపాడ్ నుంచి బస్సులో వేదిక వద్దకు..
- **3:49 గంటలకు :** సీఎం ప్రసంగం ప్రారంభం
- **4:09 గంటలకు :** ప్రసంగం ముగింపు
- **4:16 గంటలకు :** హెలికాప్టర్‌లో సీఎం సూర్యాపేట వైపు పయనం..

ఉర్రూతలూగించిన గులాబీల జెండలు పాట

ఏపూరి సోమన్న కళా బృందం సభ్యులు పాటలు పాడుతూ సభికులను ఉత్సాహపరిచారు. గులాబీల జెండల పాటకు స్టేజీపై ఉన్న మంత్రి సత్యవతి రాథోడ్, మానుకోట ఎంపీ మాలోతు కవిత, మహిళా ప్రజాప్రతినిధులు నృత్యాలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సభ ముగియడంతో ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

మళ్లీ గెలిపిస్తే మరింత సేవ చేస్తా: రెడ్యానాయక్



ఇంతకాలం ప్రజల దీవెనలు, ఆశీస్సులతో డోర్నకల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేశానని, మళ్లీ గెలిపిస్తే మరింత సేవ చేస్తానని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. ఇప్పటి వరకు ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో మరిపెడలో 100 పడకల ఆస్పత్రిని మంజూరు చేయించుకున్నామని చెప్పారు. మళ్లీ మన ప్రభుత్వం రాగానే మరిపెడ రెవెన్యూ డివిజన్, డోర్నకల్‌లో 100 పడకల ఆస్పత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేయించుకుందామన్నారు. మాకుల వేంకటేశ్వర స్వామి దేవాలయానికి రూ.5కోట్లు, నియోజకవర్గంలోని దళితులందరికీ దళితబంధు వచ్చేలా కృషి చేస్తానని చెప్పారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించండి



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం: ఎన్నికల్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు కేంద్ర బలగాలు, పోలీసులు కృషి చేయాలని సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. ఎన్నికల బందోబస్తు కోసం కమిషనరేట్‌కు వచ్చిన కేంద్ర సాయుధ పారామిలటరీ పోలీసు అధికారులతో సీపీ మంగళవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా వరంగల్ ప్రజల జీవన విధానం, భౌగోళిక అంశాలపై వివరించారు. అనంతరం సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ తమకు అప్పగించిన విధులు నిర్వహించాలన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కేంద్ర బలగాలు రానున్నాయని, వారికి స్థానిక పోలీసుల, ప్రజల సహకారం ఉంటుందని తెలిపారు. సమావేశంలో ఎన్నికల పరిశీలకుడు సుజిత్‌కుమార్, బీఎస్‌ఎఫ్ కమాండెంట్ ముఖేశ్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీలు జితేందర్‌రెడ్డి, రమేశ్‌కుమార్, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఏసీపీ నాగయ్య, కమ్యూనికేషన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, కేంద్ర బలగాల అధికారులు పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన ర్యాలీ



ర్యాలీగా వెళ్తున్న వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది

హన్మకొండ: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రాధాన్యాన్ని తెలియజేసేలా ప్లకార్డులు పట్టుకుని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది మంగళవారం ర్యాలీ నిర్వహించారు. హనుమకొండ 4వ డివిజన్ పెద్దమ్మగడ్డ నుంచి కాకతీయ కాలనీ వరకు సాగిన ర్యాలీకి ముందు పెద్దమ్మగడ్డ జంక్షన్‌లో మానవహారం చేపట్టారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యాకూబ్‌పాషా, సిబ్బంది వాణిశ్రీ, ఉమశ్రీ, శాహేలా, ప్రసాద్, ప్రసన్నకుమార్, మాధవరెడ్డి, భగవాన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆపరేషన్ వేగు



ప్రత్యర్థుల కదలికలు, ప్రచార సరళిపై వేగుల ఆరా..

- ఫొటోలు, వీడియోలు తీసి వాట్సాప్‌లో సమాచారం
- జంపింగ్ జపాంగ్‌లపై ఆరా.. అనుమానం వస్తే నిఘా
- అసంతృప్తుల వివరాలు సేకరణ.. పార్టీలో చేర్చుకునేందుకు మంతనాలు
- కేడర్‌ను బట్టి రేటు ఫిక్స్.. అభ్యర్థుల ఆమోదంతో చేరికలు
- ఉమ్మడి వరంగల్‌లో చాపకింద నీరులా పనిచేస్తున్న వైనం

జంగ్ తెలంగాణ

సాక్షిప్రతినిధి, వరంగల్:

అసెంబ్లీ ఎన్నికల సమరానికి తెరపడేందుకు మరో ఎనిమిది రోజులే సమయం ఉంది. అంతకు రెండు రోజుల ముందే ప్రచారఘట్టం ముగియనుంది. ఈ నెల 30న పోలింగ్ జరగనుండగా అభ్యర్థుల గెలుపో.. ఓటమో డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు తర్వాత తేలనుంది. ఈనేపథ్యంలో ఓ వైపు ప్రచారాన్ని హోరెత్తిస్తూనే.. మరోవైపు ప్రత్యర్థుల కదలికలను కనిపెట్టేందుకు అభ్యర్థులు 'వేగుల'ను నియమించుకున్నారు. ఒకరిని చూసి ఒకరు ఒక్కో నియోజకవర్గంలో సుమారు 150 నుంచి 200 మందిని నియమించుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందడం కోసం అస్త్రశస్త్రాలను సంధిస్తున్న అభ్యర్థులు.. రోజువారీగా రాత్రి 9 నుంచి 10.30 గంటల్లోపు వేగులు ఇచ్చే సమాచారాన్ని పరిగణనలోకి తీసుకుని మరుసటి రోజు ఎదురుదాడికి సిద్ధమవుతున్నారు.

ప్రత్యర్థుల కదలికలు, ప్రచార సరళిపై దృష్టి

పార్టీలో చురుకైన నాయకులు, కార్యకర్తలతోపాటు డిగ్రీ, పీజీ పూర్తయిన విద్యార్థులను వేగులుగా ఉపయోగించుకుంటున్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి సంబంధించి టీఆర్‌ఎస్‌వీ, యూత్ విభాగం కార్యకర్తలు నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తూ పరిస్థితిని అంచనా వేసి అభ్యర్థులకు చేరవేస్తున్నారు. పోటీ పార్టీల అభ్యర్థుల ప్రసంగాలకు సంబంధించిన వీడియోలు, జన సమీకరణ ఫొటోలు వాట్సాప్ ద్వారా షేర్ చేస్తున్నారు. మరోవైపు ఇంటెలిజెన్స్ వర్గాలు కూడా అభ్యర్థుల ప్రచార సరళి, ప్రజల నుంచి వస్తున్న స్పందనతోపాటు నిరసనలు, నిలదీతలను రిపోర్టు చేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఎన్‌ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామాల్లో తిరుగుతూ సర్వే బృందాల పేరిట వివరాలు సేకరిస్తున్నారు. ఇటీవల పరకాల, ములుగు, జనగామ, వరంగల్ తూర్పు, భూపాలపల్లి, డోర్నకల్ తదితర నియోజకవర్గాల్లో ఈ బృందాలు తిరిగి పార్టీ హైకమాండ్‌కు నివేదిక కూడా ఇచ్చినట్లు చెబుతున్నారు. బీజేపీ అభ్యర్థుల ప్రచారసరళిపై ఆ పార్టీ సీనియర్లు బృందాలుగా ఏర్పడి ఒక జిల్లాకు చెందిన వారు మరో జిల్లాలో తిరుగుతున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వర్గాలు కూడా అభ్యర్థుల కదలికలు, ప్రచారసరళిని గమనించడంతోపాటు.. వారు ఓటర్లను ఏ మేరకు ప్రభావితం చేస్తున్నారో కూడా అంచనా వేసి తగు సూచనలు చేస్తున్నట్లు సమాచారం.

ఒకరిపై ఒకరు.. కోవర్టులు, అసంతృప్తులపై ఆరా

అభ్యర్థుల కోసం పనిచేస్తున్న వేగులు పార్టీలో కార్యకర్తలుగా ఉంటూనే కోవర్టులుగా వ్యవహరిస్తున్న వారిని గుర్తించే పనిలోనూ ఉన్నారు. పార్టీలు మారే ఆలోచనలో ఉన్న వారిని సైతం గుర్తిస్తున్నారు. పొద్దంతా పార్టీ అభ్యర్థితో ఉంటూనే రాత్రివేళల్లో పోటీ అభ్యర్థులు, వారి అనుచరులతో 'సిట్టింగ్'వేసి గుట్టు విప్పుతున్న వారినీ గుర్తిస్తున్నారు. ఇలా గుర్తించిన వారిని అభ్యర్థులు మందలించడంతో పార్టీలు మారిన వారు కూడా ఉన్నారు. ఇటీవల గ్రేటర్ వరంగల్‌లో ఓ కీలకనేత, ఇద్దరు కార్పొరేటర్లు పార్టీలు మారారు కూడా. అంతకు ముందు పరకాల, భూపాలపల్లి, డోర్నకల్, జనగామ నియోజకవర్గాల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. అదేవిధంగా పార్టీలో ఉంటూ అసంతృప్తితో రగిలిపోయే వారిని గుర్తించి జాబితాను కూడా తయారు చేసి అభ్యర్థులకు అందజేస్తుండగా... ఆ మరుసటి రోజే అసంతృప్తులను కలిసి బుజ్జగించి వెంట తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. పార్టీలో గూఢాచారులను నియమించుకుని ఎప్పటికప్పుడు కోవర్టులు, అసంతృప్తులను నివారించడంలో సఫలమవుతున్న అన్ని పార్టీల అభ్యర్థులు మరో పది రోజులు ఈ వ్యవస్థను కొనసాగించనున్నారు. అభ్యర్థులకు చాపకింద నీరులా పనిచేస్తున్న వేగుల వ్యవస్థ.. ప్రభుత్వాలకు 'ఇంటెలిజెన్స్'లా ఉపయోగపడుతోందన్న చర్చ జరుగుతోంది.

మొరం మాఫియా వీరంగం

- ఉప సర్పంచ్‌పై దాడి.. తీవ్ర గాయాలు
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

హసన్‌పర్తి: మండల కేంద్రంలో మొరం దందా జోరుగా సాగుతోంది. అడ్డు చెప్పేవారు లేకపోవడంతో ఈదందా చేస్తున్న అక్రమార్కులు కోట్లకు పడగలెత్తుతున్నారు. తాజాగా తమ వ్యాపారానికి అడ్డొస్తున్నాడనే ఆగ్రహంతో హరిశ్చంద్రనాయక్ తండా ఉపసర్పంచ్ రాజుపై దాడికి దిగారు. ఈఘటనలో రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రాత్రి ఫిర్యాదు చేశారు. సిద్దాపురం–హరిశ్చంద్రనాయక్ తండాల మధ్య ఉన్న గుట్టను కొంతమంది అక్రమార్కులు మొరం క్వారీగా మార్చారు. ఏడాది కాలంగా ఈ దందా సాగుతోంది. అయితే వ్యాపారానికి ఉప సర్పంచ్ రాజు అడ్డొస్తున్నాడని మంగళవారం రాత్రి మొరం అక్రమార్కులు దాడికి దిగారు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు రాజు ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ గోపీ తెలిపారు.

వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలి

సంగెం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పల్లె దవాఖానలోని వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కాజీపేట వెంకటరమణ సూచించారు. కాపులకనిపర్తి, గవిచర్లలోని పల్లె దవాఖానాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్య సేవలను అందించాలన్నారు. పిల్లలు, గర్భిణులకు వంద శాతం టీకాలు వేయాలన్నారు.

పోలింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్/కరీమాబాద్: అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అధికారులు కట్టుదిట్టమైన, పటిష్ట ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వికాస్‌రాజ్, రాష్ట్ర సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్, ఇతర అధికారులతో కలిసి ఎన్నికల నిర్వహణపై హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు సిక్తాపట్నాయక్, ప్రావీణ్య, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. హనుమకొండ నుంచి అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, జెడ్పీ సీఈఓ వెంకటేశ్వర్లు, అధికారులు సురేశ్, నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు. వరంగల్ నుంచి రిటర్నింగ్ అధికారులు అశ్వినితానాజీ, రిజ్వాన్‌బాషా, ఆర్డీఓ వాసుచంద్ర, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా హోం ఓటింగ్

హన్మకొండ అర్బన్: హోం ఓటింగ్ విధానాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ హెచ్.ఎస్ గోపాలకృష్ణ, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. ఈనెల 21, 22, 23 తేదీల్లో జిల్లాలో వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాల్లో హోం ఓటింగ్‌ను మంగళవారం అధికారులు ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ సిక్తాపట్నాయక్ మాట్లాడుతూ.. వరంగల్ పశ్చిమలో 236, పరకాలలో 143 మంది హోం ఓటింగ్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారులు, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఇతర అధికారులు హోం ఓటింగ్ ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిసైడింగ్, అదనపు ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ అధికారులు, సెక్టార్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మొదలైన ఎన్నికల రగడ!

- హోంఓటింగ్‌లో పక్షపాతం చూపుతున్నారంటూ ఆందోళన
- బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధి సమక్షంలో ఓటింగ్‌పై మండిపాటు
- కాంగ్రెస్ నాయకుడిపై చేయిచేసుకున్న పరకాల సీఐ
- గొడవతో వైస్ ఎంపీపీని కూడా అనుమతించని అధికారులు



ఆందోళన చేస్తున్న నాయకులు

పరకాల: పరకాల నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల రగడ ముందే మొదలయ్యింది. ఎన్నికల కమిషన్ కొత్తగా హోమ్ ఓటింగ్ విధానాన్ని తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ముందుగా దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు, 80 ఏళ్లు పైబడిన వృద్ధులు ఇంటి వద్దే ఓటు వేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు పరకాల నియోజకవర్గంలో ఉన్న 302 ఓట్లను ఏజెంట్ల సమక్షంలో మంగళవారం నుంచి ప్రారంభించారు. అయితే పరకాల మండలం నాగారంలో ఏజెంట్ కోసం దరఖాస్తు చేసుకున్న బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ చింతిరెడ్డి మధుసూధన్‌రెడ్డి సమక్షంలో హోం ఓటింగ్ నిర్వహించడం వివాదాస్పందంగా మారింది. హోమ్ ఓటింగ్ ద్వారా ఎంపికైన ఓట్లు నాగారంలో 14 ఉండగా.. 4 ఓట్లు కాంగ్రెస్, బీజేపీ ఏజెంట్లు లేకుండానే వేయించడం గొడవకు దారితీసింది. అధికారులు సైతం పక్షపాతం చూపిస్తూ.. కేవలం బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధి సమక్షంలో ఓటు వేయించడం వల్ల ఆఓటర్లపై ఒత్తిడి చూపించే అవకాశం ఉందని నాగారం సర్పంచ్ కట్కూరి స్రవంతి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ జయంత్‌లాల్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఆందోళనకు దిగారు.

చేయిచేసుకున్న సీఐ

ఆందోళనకు దిగిన కాంగ్రెస్ నాయకులపై పరకాల సీఐ వెంకటరత్నం చేయిచేసుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు, ఎన్నికల అధికారుల తీరుపై రెండు పార్టీల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీని అక్కడి నుంచి పంపించాల్సి వచ్చింది. దీంతో గొడవ సద్దుమణిగి అధికారులు ఓటింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. అసలే నాగారం గ్రామంలో మూడు పార్టీల మధ్య నువ్వా నేనా? అన్నట్లు పోటీ ఉండగా.. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నికల అధికారులు చూపించిన అత్యుత్సాహం అసెంబ్లీ ఎన్నికలకు ముందే గొడవకు నాంది పలికినట్లు అయిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎస్సై గారూ.. ఇదేం 'చట్టం'?

మైనర్‌ను వివాహం చేసుకున్న ముప్పై ఏళ్ల వ్యక్తి

- ఆపై రక్షణ కోసం చెన్నారావుపేట పోలీసుల చెంతకు..
- తమ పాప మైనర్ అని తల్లిదండ్రులు చెప్పినా నిర్లక్ష్యం
- ఆధార్ కార్డు, ఆసుపత్రి డిశ్చార్జ్ కార్డు చూపించినా జాన్తానై..
- స్టడీ సర్టిఫికెట్ తీసుకొని వస్తే చూద్దామంటూ దాటవేత
- అయినా ఆ వ్యక్తితోనే బాలికను పంపిన అధికారి
- సర్టిఫికెట్ తీసుకొచ్చినా కనిపించని బాలిక ఆచూకీ





సాక్షి, వరంగల్: మైనర్‌ను పెళ్లి చేసుకుని భద్రత కోసం వచ్చిన ఓ వ్యక్తికి వరంగల్ పోలీసు కమిషనరేట్ పోలీసులు అనుకూలంగా వ్యవహరించడం సంచలనంగా మారింది. పుట్టిన తేదీకి ఆధార్ కార్డు ఆధారం కాదంటూ సుప్రీంకోర్టు చెప్పినా అదే ఆధార్ కార్డును ఆసరా చేసుకుని సదరు బాలికను మేజర్‌గా గుర్తించి మరీ అతడి వెంట పంపడం పోలీసుల పనితీరుపై విమర్శలు వస్తున్నాయి. మహిళల భద్రత విషయంలో ఎక్కడా తగ్గేదే లేదని ఓవైపు ప్రభుత్వం చెబుతుంటే.. అందుకు విభిన్నంగా చెన్నారావుపేట పోలీసులు అది కూడా స్టేషన్ హౌస్ ఆఫీసర్ వ్యవహరిస్తున్నారు. కనీసం బాధితురాలి తల్లిదండ్రుల మాటలు పట్టించుకోకపోవడం తెరవెనుక ఏం జరిగి ఉంటుందనే చర్చ జోరుగా జరుగుతోంది. పాపను తమ వెంట పంపకుండా.. ఎక్కడ భద్రత కల్పిస్తారంటే సదరు ఎస్సై కనీస సమాధానం ఇవ్వకపోవడంతో మంగళవారం రాత్రంతా ఆ తల్లిదండ్రులకు జాగారం చేస్తూ బోరున విలపించారు.

అన్ని ధ్రువపత్రాలు సమర్పించినా ససేమిరా..

దాదాపు 30 ఏళ్లున్న వ్యక్తితో బాలికకు వివాహం జరిగితే వాస్తవం తెలుసుకోకుండా సదరు పోలీసు అధికారి ఏకపక్షంగా వ్యవహరించడంతో బాలికల భద్రత చట్టం సరిగా అమలు అవుతుందా? లేదా అనే చర్చ జరుగుతోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. చెన్నారావుపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ బాలిక(15)కు 30 ఏళ్ల వ్యక్తి మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకున్నాడు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి రక్షణ కల్పించాలని కోరారు. ఆ వెంటనే బాలిక తల్లిదండ్రులకు సమాచారం అందడంతో ఠాణాకు వెళ్లి తమ పాప బాలిక నని తెలిపారు. దీనికి ఆధారంగా ఆధార్ కార్డు చూపించినా అదీ చెల్లదన్నారు. బాలిక పుట్టిన తేదీ, బాలిక జన్మించినప్పటి దవాఖాన డిశ్చార్జ్ కార్డు చూపించినా సదరు అధికారి తిరస్కరించారు. బాలిక చదివిన పాఠశాలలో స్టడీ సర్టిఫికెట్ తీసుకురమ్మని చెప్పగా 'రాత్రి అయిందా కదా సార్ రేపు తీసుకొస్తాం. పాపను మాతో పంపించండన్నా' స్పందించలేదు. ఆ తర్వాత తల్లిదండ్రులను అక్కడి నుంచి పంపిన అనంతరం బాలికను ఆ వ్యక్తితోనే పంపించారు. మంగళవారం సాయంత్రం వరకూ బాలిక ఆచూకీ లభించకపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

నిబంధనలు ఏంటీ..

బాలల న్యాయ చట్ట ప్రకారం.. 18 సంవత్సరాలు లోపు బాలల విషయాలు పోలీసుల దృష్టికి వస్తే వెంటనే చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, చైల్డ్ హెల్ప్ లైన్, బాలల సంరక్షణ విభాగాలకు సమాచారం అందించాలి. సదరు అధికారులు బాలుడు లేదా బాలిక స్థితిగతులు తెలుసుకుని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపరిచి వారి ఆదేశాలకు అనుకూలంగా వ్యవహరిస్తారు. కానీ ఇక్కడ అలాంటిదేమీ జరగలేదు. పోలీసులు ఏకంగా పెళ్లి చేసుకున్న వ్యక్తి వెంట సదరు బాలికను పంపించడం తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. సీడబ్ల్యూసీ ముందుకువస్తే ఆ బాలికతో మాట్లాడి సఖి కేంద్రానికి పంపి కౌన్సెలింగ్ ఇస్తారు. లేదంటే తల్లిదండ్రులతోని వెళ్తానంటే పంపిస్తారు. అయితే ఇక్కడ అవేమీ జరగకుండా పోలీసులు నిర్ణయం తీసుకుని బాలికను ఆ వ్యక్తితో పంపడంతో ఆమె పరిస్థితి ఎలా ఉందనే టెన్షన్ తల్లిదండ్రుల్లో నెలకొని ఉంది.

విచారణ చేపట్టిన చైల్డ్ వెల్ఫేర్ కమిటీ..

ఈ విషయం తెలిసి తల్లిదండ్రులు పోలీసులను కలిసి వచ్చిన అనంతరం మండల స్థాయి ఐసీడీఎస్ అధికారులు చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి సమాచారం అందించగా వారు గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. సదరు బాలికకు 15 సంవత్సరాలు మాత్రమే ఉండగా, చట్ట విరుద్ధంగా వ్యక్తి పెళ్లి చేసుకున్నాడని, బాలిక ఆచూకీ సైతం లేదని సీడబ్ల్యూసీ కమిటీని ఆశ్రయించి తమకు న్యాయం చేయాలని తల్లిదండ్రులు కోరారు. కాగా, బాలల న్యాయ చట్టాలను ఉల్లంఘించిన సదరు పోలీసు అధికారిపై చర్యలు తీసుకోవాలని పలువురు బాలల హక్కుల కార్యకర్తలు కోరుతున్నారు.

దోచుకోవడం, దాచుకోవడమే కాంగ్రెస్ నైజం



విలేకరులతో మాట్లాడుతున్న కడియం శ్రీహరి



కడియం శ్రీహరితో గౌడ సంఘం నాయకులు

- బీఆర్‌ఎస్ స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థి కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసం, దగా అని.. దోచుకోవడం, దాచుకోవడం ఆపార్టీ నేతల నైజమని బీఆర్‌ఎస్ పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి అన్నారు. డివిజన్ కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఘన్‌పూర్‌లో సోమవారం జరిగిన ప్రజా ఆశీర్వాద సీఎం సభ దిగ్విజయంగా జరిగిందని, 70వేల మందికి పైగా ప్రజలు, పార్టీ శ్రేణులు హాజరయ్యారని, సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ ప్రచారం అంతా సోషల్‌మీడియా ద్వారానే జరుగుతుందని, గ్రామాల్లో వారి ప్రచారానికి స్పందన లేదన్నారు. లింగంపల్లి-మల్కాపూర్ రిజర్వాయర్ ప్రసక్తే లేదని, రద్దయిందని, ఆ భూములకు లిఫ్ట్ ద్వారా సాగునీరు అందిస్తామన్నారు. సభలో సీఎం కేసీఆర్ దేవాదుల ఎత్తిపోతల పథకం గురించి మాట్లాడారని, లింగంపల్లి రిజర్వాయర్ అవసరం లేదని సీఎంకు చెప్పామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసి బ్రహ్మాండగా 24 గంటల ఉచిత కరెంటు ఇస్తుంటే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంటు చాలంటాడని, కర్ణాటక ఉపముఖ్యమంత్రి శివకుమార్ తమ రాష్ట్రంలో ఐదు గంటల కరెంటు ఇస్తున్నామని చెబుతున్నారన్నారు. 24 గంటల కరెంటు ఇచ్చే బీఆర్‌ఎస్ కావాలా, 3 గంటల కరెంటు ఇచ్చే కాంగ్రెస్ కావాలా ప్రజలు తేల్చుకోవాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అభివృద్ధిలో నియోజకవర్గం మళ్లీ పదేళ్ల వెనక్కి పోతుందని, నియోజకవర్గ అభివృద్ధిపై, సమస్యలపై తనకు పరిపూర్ణమైన అవగాహన ఉందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఇందిర గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయి మళ్లీ నియోజకవర్గానికి రాలేదని, ఐదేళ్ల తర్వాత ఎన్నికల కోసం వచ్చిందని తెలిపారు. కడియం ఫౌండేషన్ ద్వారా దళిత బిడ్డలను చదివిస్తున్నానని, కరోనా సమయంలో ఐదు వేలమందికి పైగా సహాయం చేశానన్నారు. అందుబాటులో ఉండి అభివృద్ధి చేసే తనను ఆశీర్వదించి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు సీహెచ్.నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, చేపూరి వినోద్, రాపోలు మధుసూదన్ రెడ్డి, తాటికొండ సురేష్‌కుమార్, రజాక్‌యాదవ్, నీల గట్టయ్య, బూర్ల శంకర్, మాచర్ల గణేష్, నర్సింహులు, ఏ.బాలరాజు, పాతికుమార్ ఉన్నారు.

కడియంకే గౌడసంఘం మద్దతు

ప్రస్తుత ఎన్నికల్లో నియోజకవర్గ అభివృద్ధి ప్రధాత, బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరికే తమ సంపూర్ణ మద్దతు అని గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజుగౌడ్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద గౌడ సంఘం నాయకులు కడియం శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ గౌడ కులస్తుల సంక్షేమం కోసం ప్రత్యేక చొరవతో పనిచేశారని, తమ గౌడ కులస్తుల మద్దతు బీఆర్‌ఎస్ పార్టీకి, కడియం శ్రీహరికి ఎల్లవేళలా ఉంటుందన్నారు. గౌడ సంఘం నాయకులు ఇల్లందుల నరేష్, పులి శ్రీను, వంగ శ్రీను, మాచర్ల రఘురాములు, గట్టు రమేష్, చేరాలు, సుదర్శన్,ర సుధాకర్ పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరికి మద్దతు తెలుపుతున్న నాయిబ్రాహ్మణులు

ధర్మసాగర్: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కడియం శ్రీహరి గెలుపునకు ధర్మసాగర్, వేలేరు మండలాల గౌడ కులస్తులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. రెండు మండలాల గౌడ కులస్తులందరూ కడియం శ్రీహరి కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

లింగాలఘణపురం: బీఆర్‌ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరికి మద్దతు తెలుపుతూ మంగళవారం మండల కేంద్రంలోని నాయిబ్రాహ్మణులు ఆయనను కలిసి సంఘీభావం తెలిపారు. ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో తెలిపించేందుకు ప్రతి ఒక్కరం కృషి చేస్తామని చెప్పారు. వీరిలో లింగాల వెంకటేశ్, లక్ష్మీనారాయణ, ఆదిత్య, యాకన్న, సత్యనారాయణ, వేణు, సతీష్, హరినాథ్, క్రాంతి ఉన్నారు.

రైతుల వివరాలు నమోదు చేయాలి

కమలాపూర్: కొనుగోలు కేంద్రాల్లో రోజూ ధాన్యం విక్రయించిన రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పౌర సరఫరాల శాఖ రాష్ట్ర కమిషనర్ వి.అనిల్‌కుమార్ ఆదేశించారు. కమలాపూర్‌లో ఐకేపీ, గూడూరులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కొనుగోలు కేంద్రాల్లోని రికార్డులు పరిశీలించి కొనుగోలు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చి మద్ద తు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ డీఎస్‌ఓ వసంతలక్ష్మి, డీఎం మహేందర్, డీపీఎం ప్రకాశ్, డీటీ కృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ పేరాల సంపత్‌రావు, సీఈఓ చోటేమియా, ఐకేపీ సీసీ మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

ఓరుగల్లు కీర్తిని చాటాలి..



సమావేశంలో కేంద్ర పురావస్తుశాఖ అధికారి మల్లేశం, చరిత్రకారుడు గణపతి, విద్యార్థులు

- చారిత్రక కట్టడాలను పరిక్షించుకోవాలి
- ప్రముఖ చరిత్రకారుడు రాచర్ల గణపతి

ఖిలా వరంగల్: చారిత్రక కాకతీయుల రాజధాని ఓరుగల్లు కీర్తిని ప్రపంచానికి చాటాలని ప్రముఖ చరిత్రకారుడు రాచర్ల గణపతి అన్నారు. శిల్పాల ప్రాంగణంతోపాటు పర్యాటక ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 19 నుంచి 25వ తేదీ వరకు జరుగుతున్న వారసత్వ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఖిలా వరంగల్ మధ్యకోటలోని శిల్పాల ప్రాంగణంలో కేంద్ర పురావస్తుశాఖ అదీక్షకురాలు స్మిత ఎస్ కుమారి ఆధ్వర్యంలో జిల్లా అధికారి మడిపల్లి మల్లేశం అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాకతీయుల విశిష్టత, చారిత్రకట్టడాల పరిరక్షణపై ఆయన మాట్లాడారు. చారిత్రక కట్టడాల పరిరక్షణలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉంటుందన్నారు. పర్యాటకులు పర్యాటక ప్రదేశాల తినుభండారాలు డస్ట్‌బిన్లలో మాత్రమే వేయాలన్నారు. శిల్పకళా సంపదను కాపాడుతూ భావితరాలకు అందించాల్సిన అవసరం మనపై ఉందన్నారు. కార్యక్రమంలో సూర్య కిరణ్, ఏడీ మల్లునాయక్ , పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమ పాలన



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మల్లన్న, ఇందిర



పాంనూర్‌లో ఎన్నికల ప్రచారంలో సింగపురం ఇందిర

- పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థి ఇందిర

రఘునాథపల్లి: ప్రజలను మోసం చేస్తున్న అవినీతి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించే సమయం ఆసన్నమైందని, కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమ పాలన సాధ్యమని స్టేషన్‌ఘన్‌పూర్ కాంగ్రెస్ అభ్యర్థి సింగపురం ఇందిర అన్నారు. మంగళవారం మండలంలోని చింతలగూడెం, వీరారెడ్డితండా, సోమయ్యకుంటతండా, మాధారం, నిడిగొండ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అయా గ్రామాల్లో ఇందిరకు మహిళలు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనను ఎమ్మెల్యేగా గెలిపించినట్లయితే ఐదేళ్లపాటు అభివృద్ధి చేస్తూ రుణం తీర్చుకుంటానన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మేకల వరలక్ష్మీనరేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, నిడిగొండ, పీఏసీఎస్ చైర్మన్ గంగిడి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత జీవితాలను నాశనం చేసిన బీఆర్‌ఎస్

ఉద్యోగాలు కల్పించడంలో కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని స్టేషన్‌ఘన్‌పూర్ కాంగ్రెస్ అభ్యర్థి సింగపురం ఇందిర కూతురు ఆర్పిత అన్నారు. కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో 500 బైక్‌లతో చేపట్టిన ర్యాలీలో ఆమె మాట్లాడారు.

నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ గెలువదు

స్టేషన్‌ఘన్‌పూర్: సీఎం కేసీఆర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి మోకాళ్లపై పాక్కుంటూ వచ్చినా ఘన్‌పూర్‌లో కాంగ్రెస్‌పై గెలువలేరని, కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేస్తున్న ఒక ఆడబిడ్డను ఓడగొట్టేందుకు కేసీఆర్ ముగ్గురిని తోలిండని కాంగ్రెస్ నాయకుడు తీన్మార్ మల్లన్న అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అభ్యర్థి సింగపురం ఇందిర ప్రచారంలో మంగళవారం ఘన్‌పూర్‌లో ఆయన పాల్గొన్నారు. అనంతరం వారు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ నిన్న బాతాల పోశెట్టి కేసీఆర్ వచ్చిపోయిండు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి గంగిరెద్దుల్లా కేసీఆర్‌కు పనిచేస్తున్నారన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మారపాక రవి, ఎంపీటీసీ సింగపురం దయాకర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరకు వైఎస్సార్‌టీపీ మద్దతు

కాంగ్రెస్ అభ్యర్థి సింగపురం ఇందిరకు మండల వైఎస్సార్‌టీపీ మండల అధ్యక్షుడు ముసిపట్ల నరేష్‌బాబు ఆధ్వర్యంలో మద్దతు పలికారు.

బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే మన బతుకులు ఆగం

మరోసారి మోసపోయి బీఆర్‌ఎస్ పార్టీకి ఓట్లు వేస్తే మన బతుకులు ఆగమైతాయని, ఓటర్లు ఆలోచించి ఓట్లు వేయాలని కాంగ్రెస్ అభ్యర్థి సింగపురం ఇందిర అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని పాంనూర్, శివునిపల్లి గ్రామాల్లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ప్రచారంలో ఆమె పాల్గొని మాట్లాడారు. చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు.

'తెలంగాణ ఉద్యమ రత్న' పురస్కారానికి హరీశ్‌రావు ఎంపిక

కమలాపూర్: 'తెలంగాణ ఉద్యమ రత్న 2023-24' పురస్కారానికి రాష్ట్ర ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్‌రావును ఎంపిక చేసినట్లు శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ (ఎస్‌ఆర్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ అమరేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస్ రామానుజన్ ఫౌండేషన్ 20వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమ నాయకులకు పార్టీలకతీతంగా తెలంగాణ ఉద్యమ రత్న అవార్డు ఇవ్వాలని సంకల్పించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఉద్యమ నాయకుడు, మంత్రి హరీశ్‌రావును ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. త్వరలో ఢిల్లీలో నిర్వహించే ఎస్‌ఆర్‌ఎఫ్ 20వ వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి హరీశ్‌రావుకు పురస్కారం అందజేస్తామని అమరేష్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

హసన్‌పర్తి: నగరంలోని గోపాల్‌పూర్‌లో పేకాట కేంద్రంపై మంగళవారం టాస్క్ ఫోర్స్, పోలీసులు సంయుక్త దాడులు నిర్వహించారు. ఇందులో దేవన్నపేటకు చెందిన వేమన్నరెడ్డి, మహేందర్‌రెడ్డి, రణధీర్‌రెడ్డి, గోపాల్‌పూర్‌కు చెందిన సుమన్, ఉమాశంకర్ రెడ్డి, రాంచందర్‌ను అరెస్టు చేసి రూ.45,520 నగదుతో పాటు ఆరు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్‌తెలిపారు.

గీత కార్మికులకు ఐదు గ్యారంటీలు ఇవ్వాలి

- మేకపోతుల వెంకటరమణ

కాజీపేట అర్బన్: రాజకీయ పార్టీలు గీత కార్మికులకు ఐదు గ్యారంటీలను ఇవ్వాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ అన్నారు. 31వ డివిజన్‌లోని గౌడ హాస్టల్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కల్లుగీత కార్మిక సంఘం 66వ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా కేజీకేఎస్ వెంకటరమణ మాట్లాడారు. ఎన్నికల ముందు ఓట్ల కోసం రాజకీయ పార్టీలు గీతకార్మికులకు ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే విస్మరిస్తున్నారని అన్నారు. గీత కార్మికులకు వృత్తిలో ప్రమాద నివారణకు చర్యలు, సేఫ్టీ మోకులు, ద్విచక్ర వాహనాలు, బీమా సౌకర్యం, రూ.లక్ష ఆర్థిక సాయం, వంద కోట్ల వార్షిక బడ్జెట్ కేటాయింపు వంటి ఐదు గ్యారంటీలను అమలు చేసుకునేందుకు ఐక్యంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గోపా జిల్లా అధ్యక్షుడు చిర్ర రాజు గౌడ్, బొనగాని యాదగిరి, తాళ్లపల్లి జనార్దన్‌గౌడ్, గాని సాంబయ్య, సుధాకర్, శ్రీనివాస్, గంగాధర్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యరంగానికి ఉజ్వల భవిష్యత్

- కేవీకే ప్రధాన శాస్త్రవేత్త రాజన్న

కరీమాబాద్: మత్స్యరంగానికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మామునూరు కృషివిజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రాజన్న అన్నారు. మామునూరు కేవీకేలో మంగళవారం ప్రపంచ మత్స్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పంటలు సాగు చేస్తున్న రైతులు చేపల పెంపకం కూడా చేపట్టొచ్చని తెలిపారు. అనంతరం అంతర్జాతీయ, జాతీయ ఆక్వా ఎగుమతులు, ఆక్వా రంగంలో సవాళ్ల గురించి వివరించారు. తెలంగాణలో చేపల పెంపకం ప్రాముఖ్యం, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ఉద్దేశం, నిర్దేశిత లక్ష్యం గురించి తెలిపారు. మత్స్య శాస్త్రవేత్త గణేశ్ ఓవర్ ఫిషింగ్, ఆశ్రయాల క్షీణత, అక్రమ పద్ధతిలో చేపలు పట్టడం, పర్యావరణ కాలుష్యం మూలంగా కలిగే నష్టాల గురించి వివరించారు. కాగా, ధర్మసాగర్ మండలం మలక్‌పల్లికి చెందిన రైతు కుమారస్వామి జెల్ల చేపలు పెంచగా ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు అరుణజ్యోతి, సౌమ్య, గణేశ్, రాజు, శశాంక్, సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.



రైతు కుమారస్వామిని సన్మానిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

చోరీకి పాల్పడిన ఇద్దరి అరెస్ట్

- బంగారు, వెండి నగలు స్వాధీనం

కాజీపేట: తాళం వేసి ఉన్న ఇంట్లో రూ.2లక్షల విలువ చేసే బంగారు, వెండి నగలు, నగదును అపహరించిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సార్ల రాజు తెలిపారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాజీపేట 47వ డివిజన్ భవానీనగర్ కాలనీకి చెందిన కల్లెపు గాయత్రి ఈ నెల 10వ తేదీన ఇంటికి తాళం వేసి తన భర్త రమేష్‌కు వైద్యం చేయించడం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లింది. హాస్పిటల్‌లో ఆలస్యం కావడంతో రాత్రి వేళ బంధువుల ఇంటికి వెళ్లారు. మరుసటి రోజు ఇంటికి వెళ్లగా తాళం పగులగొట్టి ఉండటమే గాక ఇంట్లోని బంగారు, వెండి నగలు, నగదు రూ.2,41,400 కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న కాజీపేట క్రైం పోలీసులు అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ ద్విచక్ర వాహనాన్ని ఆపి సోదాలు నిర్వహించగా గాయత్రి ఇంటిలో చోరీకి పాల్పడిన వస్తువులు లభించాయి. ఎండీ యాకుబ్ పాషా(ఎస్‌ఆర్ నగర్, ఏనుమాములు), ఎండీ మహమూద్ (చింతల్, వరంగల్)కు చెందిన వీరు చోరీ సొత్తును హైదరాబాద్‌లో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లుగా ఒప్పుకోవడంతో సొత్తుతోపాటు ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. చోరీ జరిగిన నాలుగు రోజుల్లో నిందితులను పట్టుకున్న సిబ్బందిని డీసీపీ ఎంఎ బారి, ఏసీపీ డేవిడ్ రాజ్ అభినందించారు. సమావేశంలో ఎస్సైలు లలిత, నర్సింగరావు, హెడ్ కానిస్టేబుల్ వాల్యానాయక్, కానిస్టేబుల్స్ భాస్కర్, విష్ణు, శ్రీనివాస్, వేణు, రమేష్, సతీస్ రెడ్డి పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజు